సాక్షి
మహబూబాబాద్

సోమవారం | 23 | జనవరి | 2023



పట్నం..పరవశం

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర వైభవంగా ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. - 8లో▸



పథకాలను అడ్డుకుంటున్న కేసీఆర్

కేంద్ర ప్రభుత్వ పథకాలు రాకుండా సీఎం కేసీఆర్ అడ్డుకుంటున్నాడని కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34.1°/15.7°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు నూతన కలెక్టరేట్‌లో ప్రజావాణి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని కురవి రోడ్డులో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్‌లో నేడు(సోమవారం) ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శశాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందించేందుకు నూతన కలెక్టర్ కార్యాలయానికి రావాలని సూచించారు.

కానిస్టేబుల్ వీరన్నకు డాక్టరేట్



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్‌పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కుంచపు వీరన్నకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ విభాగం బాధ్యులు డాక్టరేట్ ప్రదానం చేశారు. వీరన్న పొలిటికల్ సైన్స్‌లో ×పొలిటికల్ అవేర్‌నెస్ అండ్ పార్టిసిపేషన్ ఆఫ్ వడ్డెర కమ్యూనిటీ ఆఫ్ ఏ సెలక్ట్ స్టడీ× అనే అంశంపై అధ్యయనం చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు. పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతి ప్రొఫెసర్ చంద్రునాయక్, గైడ్ చలమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీరన్న పీహెచ్‌డీ పూర్తి చేయగా వారితో పాటు పొలిటికల్ సైన్స్ బోర్డు ఆఫ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ శ్రీలత ఆయనకు డాక్టరేట్ అందజేసి అభినందనలు తెలిపారు.

సీఐటీయూ జాతీయ కార్యదర్శిగా భాస్కర్



గార్ల: సీఐటీయూ జాతీయ కార్యదర్శిగా గార్లకు చెందిన పాలడుగు భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 18 నుంచి 22వరకు బెంగళూర్‌లో జరిగిన సీఐటీయూ మహాసభల్లో తనను ఎన్నుకున్నట్లు భాస్కర్ ఆదివారం తెలిపారు. భాస్కర్ ఎన్నికపై సీపీఎం మండల నాయకులు కందునూరి శ్రీనివాసరావు, పెద్ద వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌లింగం, కవిత, అంబటి వీరస్వామి, గిరిప్రసాద్, హరినాయక్, అలువాల సత్యవతి, వివిధ ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీరు కలుషితం



దోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులు లీకవుతుండడంతో తాగునీరు కలుషితమవుతోంది. సత్యతండా క్రాస్ రోడ్డు, ఉయ్యాలవాడ ఎస్సీకాలనీ, డోర్నకల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, వెన్నారం గ్రామ శివారు కాలనీతో పాటు పలు గ్రామాల్లో భూముల్లో భగీరథ పైపులు పగలడంతో నీరంతా బయటకు ప్రవహిస్తోంది. పైపులు పగిలిన చోటునుంచి బురద నీరు చేరుతోంది. దీంతో ప్రజలకు కలుషితమైన తీగునీరు సరఫరా అవుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా అధికారులు వెంటనే స్పందించి పగిలిన పైపులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఖమ్మం సభ ఉత్సాహం నింపింది



దోర్నకల్: ఖమ్మంలో ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఆదివారం డోర్నకల్‌లో జరిగిన ఓ వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన అనంతరం పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఖమ్మం సభ స్ఫూర్తితో కార్యకర్తలు ఉత్సాహంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మన్యు పాట్నీ, తాళ్లూరి హనుమ, మల్లం అనిల్, దేవర వెంకటేశ్వర్లు, మాదా శ్రీనివాస్, గుండ్రాల భాస్కర్, భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వదలం..కదలం!

- సెక్టార్లలో తిష్టవేసిన సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు
- అండగా ప్రజాప్రతినిధులు, నాయకులు
- స్థానచలనం చేసినా సెక్టార్ మారని వైనం
- సుమారు పది సంవత్సరాలుగా అక్కడే విధులు
- అధికారులకు తలనొప్పిగా మారిన వ్యవహారం



మహబూబాబాద్: జిల్లా సంక్షేమశాఖలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలుమార్లు బదిలీ చేసినా సెక్టార్లు మాత్రం మారడంలేదు. కొందరు సూపర్‌వైజర్లు పది సంవత్సరాలుగా ఒకేచోట విధుల నిర్వర్తిస్తూ సీటు వదలడం లేదు.. అక్కడి నుంచి కదలడం లేదు. ఈ పరిస్థితి అధికారులకు తలనొప్పిగా మారింది.

వివరాలు ఇలా..

జిల్లాలో 1,285 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 152 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా సంక్షేమ శాఖలో ఐదు ప్రాజెక్టులు ఉండగా జీరో నుంచి ఆరు నెలల పిల్లలు 5,755, ఏడు నెలల నుంచి సంవత్సరం పిల్లలు 5,344, సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వయసుగల వారు 18,858, మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసు గల వారు 21,353 మంది ఉన్నారని, మొత్తం 51,308 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. 5,061మంది బాలింతలు, 5,467మంది గర్భిణుల ఉన్నారు. జిల్లాలో సూపర్‌వైజర్లు 58 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 46మంది ఉన్నారు. మూడునెలల క్రితం వరకు 28మంది ఉండగా.. అర్హత పరీక్షలు నిర్వహించి 18మందిని ఎంపిక చేశారు. సూపర్‌వైజర్లుగా పదోన్నతి పొందిన వారికి సెక్టార్లు కేటాయించారు.

పదేళ్లుగా..

ఇటీవల పదోన్నతి పొంది 18మంది సూపర్‌వైజర్లు విధుల్లో చేశారు. పాతవారు 28మంది సూపర్‌వైజర్లు ఉండగా.. వీరిలో కొందరు పనిచేస్తున్న సెక్టార్లను పదేళ్లుగా వదడలం లేదు. పలుమార్లు సంబంధిత అధికారులు సెక్టార్లు మార్చినా వదిలివెళ్లడం లేదు. కొంతమంది రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల పైరవీలతో సెక్టార్లను వదలడం లేదు.

బేఖాతర్..

గత ఏడాది నవంబర్ 24న సూపర్‌వైజర్ల తీరుపై 'ఇష్టారాజ్యం' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. జిల్లా సంక్షేమాధికారితో పాటు అధికారులు స్పందించారు. అదే నెలలో 27తేదీన సూపర్‌వైజర్ల బదిలీలు చేపట్టారు. కాగా కొంతమంది బదిలీపై వెళ్లగా.. కొంతమంది పాత సెక్టార్లలోనే తిష్టవేసి ఉన్నారు.

ఇన్‌చార్జ్ అధికారి కావడంతో..

జిల్లా ఏర్పాటు నుంచి ఎక్కువకాలం జిల్లా సంక్షేమాధికారిగా ఇన్‌చార్జ్‌లే పని చేస్తున్నారు. ప్రస్తుతం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నర్మదకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. జెడ్పీ సీఈఓ విధులతో పాటు ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తుండడంతో ఆమెపై పని భారం పడుతోంది. దీంతో ఆమె సంక్షేమ శాఖపై ఎక్కువగా దృష్టిపెట్టకపోవడంతో శాఖ పనితీరు అస్తవ్యస్తంగా మారింది. రెగ్యులర్ జిల్లా సంక్షేమాధికారిని నియమిస్తే ఆశాఖ పనితీరు మెరుగుపడి బదిలీలు, నియామకాలు, పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య విషయాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

గని కార్మికులు ఐక్యం కావాలి



యూనియన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మంత్రి సత్యవతి, ఎమ్మెల్యే, నాయకులు

- టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు పొందుతున్న ప్రయోజనాలు మిగతా అన్ని రాష్ట్రాల్లోని గని కార్మికులు పొందాలి.. ఇందుకు అందరూ ఐక్యం కావాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ జిల్లా భూపాలపల్లి ఏరియాలో నూతనంగా నిర్మించిన యూనియన్ కార్యాలయ భవనాన్ని ఆదివారం మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సింగరేణి సంస్థను అభివృద్ధి చేస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియాతోపాటు సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్‌పరం చేస్తూ వస్తోందన్నారు. కేంద్రం కుట్రలను తిప్పి కొట్టేందుకు బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్న సీఎం కేసీఆర్.. కారుణ్య నియామకాల పేరుతో 2016 నుంచి 18వేల మంది యువ కార్మికులకు ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కీలకంగా పనిచేయబోతోందని, ఈ క్రమంలో అక్కడి గని కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గాలు తెలపాల్సిన బాధ్యత సింగరేణి యువ కార్మికులపై ఉంటుందన్నారు. అంతకుముందు జయశంకర్, అంబేడ్కర్ విగ్రహాలకు కవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కొక్కుల తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదిలా ఉండగా.. యూనియన్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఎమ్మెల్సీ మధుసూదనచారి పేరు లేకపోవడంతో ఆయన వర్గం నాయకులు శిలాఫలకం తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి, రాష్ట్ర వికలాంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, గండ్ర జ్యోతి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావ్, రాజిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గణపురం : ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కోటగుళ్ల అభివృద్ధికి కృషి చేస్తా..

గణపురం: కాకతీయుల కట్టడాలు మహా అద్భుతం.. వారు నిర్మించిన ఆలయాల్లోని శిల్పకళాసంపద ఇందుకు అద్దం పడుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లను ఆమె మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులతో కలిసి సందర్శించారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఆలయ నిర్వహణను గ్రామస్తులు, పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు తెలపడంతో రూ.30 వేలు అందజేశారు. ఆలయంలో జిల్లా ఎస్పీ సురేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- రూ.10కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- ముగిసిన ఎంపీయల్‌టీ-10 క్రికెట్ టోర్నమెంట్



మానుకోట క్రికెట్ జట్టుకు రూ 30,000, ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: క్రీడలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, జిల్లా కేంద్రంలో పదెకరాల్లో రూ.10కోట్లతో ఇండోర్‌స్టేడియం, ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్ ఇతర నిర్మాణాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. లయన్స్ క్లబ్ మానుకోట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపీయల్‌టీ 10- సీజన్ త్రీ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్లు మంజూరు చేయగా.. రూ.10కోట్లతో స్టేడియం నిర్మాణపనులు జరుగున్నాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో ఐకమత్యం పెరుగుతుందని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం విజేతగా నిలిచిన మానుకోట జట్టుకు రూ.30,000లతో పాటు ట్రోఫీ, రెండో బహుమతి డోర్నకల్‌కు రూ.20,000, ట్రోఫీ, మూడో బహుమతి నల్లెల జట్టుకు రూ.10,000, ట్రోఫీని ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మార్నేని వెంకన్న, యాళ్ల మురళీధర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, డాక్టర్లు రంజిత్‌రెడ్డి, స్వామి, క్రీడాకారులు పాల్గొన్నారు.

7 నుంచి 'ఎన్విరాన్‌మెంటల్' సైన్స్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ మొదటి(ప్రీవియస్) సంవత్సరం వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. ఫిబ్రవరి 7, 9, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కాగా.. ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఫైనల్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 8, 10, 14, 16, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

నిరుపయోగం..

- జిల్లా ఆస్పత్రిలో ప్రారంభానికి నోచుకోని సీటీస్కాన్ యంత్రం
- రేడియాలజిస్ట్, టెక్నీషియన్ లేకనే ఈ దుస్థితి



అలంకారప్రాయంగా ఉన్న సీటీస్కాన్ యంత్రం

నెహ్రూసెంటర్: జిల్లా ప్రధాన జనరల్ ఆస్పత్రిలో ప్రభుత్వం మంజూరు చేసిన సీటీస్కాన్ యంత్రం ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా మారింది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుతో మానుకోట ఏరియా ఆస్పత్రిని జిల్లా దవాఖానాగా అప్‌గ్రేడ్ చేశారు. దీంతో ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఈ క్రమంలో పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అధునాతనమైన సీటీస్కాన్ మిషన్‌ను మంజూరు చేసింది. ఈ మిషన్‌ను ప్రత్యేక గదిలో ఏర్పాటు చేసి ఇన్‌స్టాల్ చేసి వినియోగించేందుకు సిద్ధంగా ఉంచారు. అయితే ఆస్పత్రిలో రేడియాలజిస్ట్, టెక్నీషియన్ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో నిత్యం ఆస్పత్రికి వచ్చే రోగులు ప్రైవేట్ సెంటర్లుకు వెళ్తున్నారు. రూ.2నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుందని రోగులు వాపోతున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్వాహకులు స్పందించి సీటీస్కాన్ మిషన్ ప్రారంభించి రోగులకు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవలు అందుబాటులోకి తేవాలి



నిత్యం వేలాది మంది వైద్య సేవల కోసం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తుంటారు. ఈ క్రమంలో రోగనిర్ధారణ పరీక్షలు చేసే మిషన్లు అందుబాటులో లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. సీటీస్కాన్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తే చాలామంది రోగులకు మేలు జరుగుతుంది. ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్, టెక్నీషియన్లను నియమించాలి.

– చేపూరి గణేష్, స్థానికుడు

ఉన్నతాధికారులకు తెలియజేశాం



రోగుల అవసరార్థం సీటీస్కాన్ మిషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా ఆస్పత్రిలో మిషన్‌ను ఇన్‌స్టాల్ చేసి సిద్ధంగా ఉంచాం. మిషన్ నిర్వహణకు సంబంధించిన రేడియాజిస్ట్, టెక్నీషియన్ లేకపోవడం వల్ల నిరుపయోగంగా మారింది. త్వరలోనే సీటీస్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

– బి.శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్

కనుల పండువగా వీరభద్రస్వామి కల్యాణం

- తొలిసారి హైదరాబాద్‌లో వేడుకలు



కల్యాణం సందర్భంగా మంగళసూత్రాలను చూపిస్తున్న ప్రధాన పూజారి అనిల్‌కుమార్

కురవి: భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని కాచిగూడ మున్నూరుకాపు సంఘం భవనంలో శ్రీ వీరభద్రస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన వీరభద్రస్వామి సేవాసమితి భక్తుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశానుసారం కురవిలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం హైదరాబాద్‌లో నిర్వహించారు. కురవి ఆలయ ఈఓ సత్యనారాయణ, ఆలయ చైర్మన్ బాదావత్ రామునాయక్ సమక్షంలో ప్రధాన పూజారి పెనుగొండ అనిల్‌కుమార్ నేతృత్వంలో వేదపండితులు కల్యాణ వేడుకలను జరిపించారు. అనంతరం శోభాయాత్ర వైభవంగా జరిగింది. కల్యాణానికి ఆలయ మాజీ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాస్ రూ.51,116 విరాళం చెక్కును అందజేశారు. అలాగే కురవిలోని నిత్యసేవారథానికి వెండి తొడుగు కోసం రూ.10,116 అందించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు రెడ్యాల శ్రీనివాస్, వేదపండితులు బాలకృష్ణ, శ్రీకాంత్, శివకిరణ్‌శర్మ, ధర్మకర్త మేక నాగిరెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ భక్తులు పాల్గొన్నారు.

నిట్‌లో ముగిసిన యూత్‌ఫెస్ట్-23

- యువత రక్తదానం చేయాలి: సీపీ రంగనాథ్

కాజీపేట అర్బన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిట్ వరంగల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన యూత్‌ఫెస్ట్-23 ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా స్టూడెంట్ కౌన్సిల్, రెడ్‌క్రాస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ హాజరయ్యారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు స్వామి వివేకానంద స్ఫూర్తితో రక్తదానం చేసి ప్రాణదానంలో భాగస్వాములు కావాన్నారు. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు మాట్లాడుతూ సామాజిక సేవల్లో విద్యార్థులను ప్రోత్సహించడంలో నిట్ వరంగల్ ముందుంటుందన్నారు. నిట్ వరంగల్ విద్యార్థులు, అధ్యాపకులు 900 మంది రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యుడు ఈవీ.శ్రీనివాసరావు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ఎకో సైక్లింగ్‌ను నిట్ క్యాంపస్‌లో నిర్వహించారు. డ్యాన్స్ అండ్ డ్రమటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉత్సాహంగా చిందులు వేశారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్, ఫ్యాకల్టీ అడ్వైజర్ హరిశంకర్, ఎంజీఎం వైద్యులు డాక్టర్ ప్రసాద్, ఆశ, నిట్ అల్యూమ్ని ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌రెడ్డి

తొర్రూరు: ఐక్యతతోనే రెడ్డి సామాజికవర్గ సమస్యల పరిష్కారం సాధ్యమని ఆలిండియా కాకతీయ ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల నరేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాంచారిమడూరు గ్రామ శివారులో రెడ్డి సంక్షేమ పరివార్ సేవా సొసైటీ 11వ వార్షికోత్సవం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఎడ్ల బ్రహ్మానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ముద్దం విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నరేష్‌రెడ్డి మాట్లాడారు. రెడ్డి సామాజికవర్గ సంక్షేమం కోసం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రెడ్డిల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌కు రెడ్డిల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. వ్యవసాయాన్ని ఉపాధిహామీకి అనుసంధానం చేయాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టంగారి మాధవరెడ్డి, సొసైటీ గౌరవ అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, కోశాధికారి కొండం నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కందాడి అశోక్‌రెడ్డి, కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలు నిర్వహించడం హర్షణీయం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మరిపెడ: జాతీయస్థాయి క్రీడాపోటీలకు మరిపెడ వేదిక కావడం హర్షణీయమని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మరిపెడ ఇండోర్ స్టేడియంలో సీనియర్స్ షటిల్ బ్యాడ్మింటన్ ముగింపు వేడుకలకు ఎస్పీ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయస్థాయి క్రీడలు మరిపెడలో నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు, షటిల్ బ్యాడ్మింటన్ లెజెండ్ ప్రవీణ్‌రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్‌రెడ్డి, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంఘికశాస్త్ర ఫోరం రాష్ట్ర కోశాధికారిగా రాధాకృష్ణాచారి



రాధాకృష్ణాచారిని సన్మానిస్తున్న ఫోరం బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ సాంఘికశాస్త్ర ఫోరం రాష్ట్ర కార్యవర్గంలో హనుమకొండకు చెందిన రాధాకృష్ణాచారికి కోశాధికారిగా చోటు దక్కింది. ఈ మేరకు ఆదివారం హనుమకొండలో రాధాకృష్ణాచారిని ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డెపెల్లి సతీష్ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, బాధ్యులు అశోక్‌కుమార్, రేవతి, కె.నర్సయ్య, జి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర వేతన చట్టం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న

నెహ్రూసెంటర్: వ్యవసాయ కార్మికులకు సమగ్ర వేతన చట్టం అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు ముంజంపల్లి వీరన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో పార్టీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. తెలంగాణలో 60లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని, వారికి సమగ్ర వేతన చట్టం లేదని అన్నారు. పెరిగిన ధరల భారంతో వ్యవసాయ కార్మికులు బతకలేక పట్టణాలకు వలసపోతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బంజరు భూములు, దేవాలయ భూములను నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయరంగ కార్మికుల సమస్యల పరిష్కారం, సమగ్ర వేతన చట్టం అమలు కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 24వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు ఉమ్మగాని సత్యం, జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఆలకుంట కొమురయ్య, పెండ యాకయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫారెస్ట్ అధికారులకు నెమలి అప్పగింత



చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వరికోల్ గ్రామానికి చెందిన రైతు నాగరాజు ఆదివారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా నిస్సాహయక స్థితిలో ఉన్న నెమలి కనిపించింది. దీంతో సర్పంచ్ సాంబయ్య, జెడ్పీటీసీ గొర్రె సాగర్‌కు సమాచారం అందించాడు. వారు ఫారెస్ట్ అధికారులకు విషయం తెలిపి నెమలిని రైతు చేతుల మీదుగా అధికారులకు అప్పగించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులపై కేసు

మహబూబాబాద్ రూరల్: గంజాయి క్రయవిక్రయాలు, సరఫరా, సేవిస్తున్నారనే సమాచారం మేరకు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్సై బి.క్రాంతికిరణ్ ఆదివారం తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మహబూబాబాద్ టౌన్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో గంజాయి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని పూలే జంక్షన్ సమీపంలో ముగ్గురు యువకులు వెంకటసాయి, సాయిరాం, కేతన్ అనుమానాస్పదంగా కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని గొర్రెల మృతి



సంగెం: రైలు ఢీకొని గొర్రెలు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని చింతలపల్లి స్టేషన్–సంగెం రైల్వే గేట్ మధ్య ఆదివారం రాత్రి జరిగింది. చింతలపల్లి గ్రామానికి చెందిన వల్లెపు కట్టమల్లు, శివరాత్రి నర్సయ్య, అలకుంట ఉప్పలయ్య తమ గొర్రె మందను మేతకు తీసుకెళ్లి ఆదివారం రాత్రి ఇంటికి తోలుకెళ్తున్నారు. చింతలపల్లి స్టేషన్–సంగెం రైల్వేగేట్ మధ్య పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్తున్న మిలీనియమ్ ఎక్స్‌ప్రెస్ గొర్రె మందను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి చెందిన 15 నుంచి 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

విన్యాసాల నడుమ బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



గంగరేగు చెట్టు కింద పట్నాలు వేస్తున్న భక్తులు



పట్నం.. పరవశం

- దారులన్నీ కొమురవెల్లికే..
- వైభవంగా మల్లన్న పట్నం వారం
- భక్తులతో రద్దీగా మారిన క్షేత్రం

కొమురవెల్లి(సిద్దిపేట): 'కోరమీసాల స్వామి.. మమ్ము దీవించు.. మా మొక్కులు స్వీకరించు'.. అంటూ భక్తజనం పారవశ్యంలో మునిగిపోయింది. ఆదివారం కొమురవెల్లి మల్లికార్జునస్వామి జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. జాతరలో మొదటివారాన్ని పట్నం వారంగా పిలుస్తారు. శనివారం సాయంత్రమే క్షేత్రానికి చేరుకున్న భక్తులు ముందుగా స్వామివారిని దూళి దర్శనం చేసుకున్నారు. ఉదయం కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానమాచరించారు. గంగరేగు చెట్టు వద్ద పట్నాలు వేసి మల్లన్న నామస్మరణ చేస్తూ మొక్కులు చెల్లించారు. అనంతరం గొల్లకేతమ్మ, బలిజ మేడలమ్మతో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. పట్నంవారం సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పక్కరాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి సుమారు ఆరుగంటల సమయం పడుతున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

బోనాలతో బారులు

ఆలయ ప్రాంగణంలో కిలోమీటర్ల పొడవునా భక్తులు బారులుతీరారు. ఒంటి నిండా బండారి (పసుపు).. చేతిలో ఈరకోలతో పోతరాజులు చేసిన విన్యాసాలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. బోనాలతో భక్తులు గుట్టపై కొలువైన రేణుక ఎల్లమ్మ గుడికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లన్న జాతరకు వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ 2 కి.మీ మేర విడిది ఏర్పాటు చేసుకున్నారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారు. వసతి గదులలో ఆదివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి సమస్య తలెత్తి భక్తులు ఇబ్బంది పడ్డారు. అన్నదాన సత్రం సమీపంలో డ్రైనేజీ లీకై మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో బోనాలతో వెళ్తున్న భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

నేడు పెద్దపట్నం, అగ్నిగుండాలు

నేడు (సోమవారం) స్వామి వారి కల్యాణ వేదిక వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఆలయ వర్గాలు నిర్వహించనున్నాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం హైదరాబాద్ ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం కొండపోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.



ఆలయంలో మల్లికార్జునస్వామి విగ్రహం

పటిష్ట బందోబస్తు

పట్నం వారం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ (అడ్మిన్) మహేందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 273 మంది పోలీసులు, 180 మంది ఎన్‌సీసీ విద్యార్థులు విధులు నిర్వహించారు.

కేంద్ర పథకాలను అడ్డుకుంటున్న కేసీఆర్

- తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- బీఆర్ఎస్‌తో ఒరిగేదేమీ లేదు
- కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

ఆత్మకూరు: తెలంగాణ పేదలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు రాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అడ్డుకుంటున్నారని, కేసీఆర్‌కు పేదల గోస తగులుతుందని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ అన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్‌తో ప్రజలకు ఒరిగేదేమి లేదని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం ఆయన స్థానిక రైతులతో సమావేశమయ్యారు. రైతులు తమకు జరుగుతున్న నష్టాలను మంత్రికి వివరించారు. ఏడాది క్రితం అకాల వర్షాలకు పంటలు పాడవగా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని, కనీసం ఫసల్ బీమా యోజన పథకం కూడా అమలు చేయలేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీఎల్ వర్మ మాట్లాడుతూ తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన రైతువేదిక భవనాల్లో మోదీ ఫొటో పెట్టకపోవడం దారుణమని మంత్రి అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని గెలిపించి డబుల్ ఇంజన్ సర్కారును తీసుకురావాలని పిలుపునిచ్చారు. కాగా, మంత్రి ప్రసంగాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలుగులో అనువదించారు. మంత్రిని డాక్టర్ విజయచందర్‌రెడ్డితో పాటు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, డైరెక్టర్ జయపాల్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ యాదగిరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గురిజాల శ్రీరామ్‌రెడ్డి, ఆర్‌పీ జయంత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

'వల్లంపట్ల'కు గిడుగు రామమూర్తి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నాగేశ్వర్‌రావు

విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన ప్రముఖ కళాకారుడు, కవి, రచయిత డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు గిడుగు రామమూర్తిపంతులు జాతీయ పురస్కారం అందుకున్నారు. నాగేశ్వర్‌రావుకు గిడుగు రామమూర్తి ఫౌండేషన్ వారు ఈ పురస్కారాన్ని ప్రకటించగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21న నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి.రాధారాణి, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆయనకు పురస్కారం ప్రదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు గిడుగు శాంతికృష్ణ, ప్రధాన కార్యదర్శి కళారత్న, బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న వల్లంపట్ల నాగేశ్వర్‌రావును ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అయిలయ్య, ప్రొఫెసర్ రతన్‌సింగ్‌ఠాకూర్, ప్రొఫెసర్ కృష్ణమాచారి, వల్పపైడి అభినందించారు.

'ప్రతిమ'లో ఆరోగ్యశ్రీ సేవలు

- ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ధీరజ్

హసన్‌పర్తి: ఆరెపల్లి శివారు ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా 133 రకాల సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ధీరజ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా అపెండెక్టమి, ల్యాప్ కోలిసిస్టెక్టమి, హెమీ థైరాయిడెక్టమి, హెర్నియా, లాప్రోస్కోపిక్ సిస్టక్టమి, హిస్టరెక్టమి తదితర చికిత్సలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎంజీఎంలో అందించే అన్నీ సేవలు ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించి రోగులను ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే, ఆస్పత్రిలో ఉచిత ఓపీ సౌకర్యం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షల్లో రాయితీలు కల్పించినట్లు డాక్టర్ ధీరజ్ తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ ధీరజ్

50శాతం మేర రాయితీపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. లాబోరేటరీ, ఎంఆర్ఐ, ఇతర స్కానింగ్ పరీక్షల్లో కూడా రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 91657 75555, 90000 07467 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో మేనేజర్ రాజ్‌కుమార్, ఓటీ ఇన్‌చార్జ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయస్వామి దేవాలయంలో చోరీ

- మూడు హుండీలు పగులగొట్టి నగదు దోచుకెళ్లిన దొంగలు
- కాశిబుగ్గలో ఘటన

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ ఓ సిటీ రోడ్డులో ఉన్న సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోని మూడు హుండీల తాళాలు పగులగొట్టి నగదును దోచుకెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఆలయంలోకి చొరబడి ధ్వజ స్తంభం, పెద్ద హనుమాన్ విగ్రహం, అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఉన్న మూడు హుండీల తాళాలు పగలగొట్టి వాటిలోని నగదును అపహరించారు. ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సభ్యుడు, ఓ భక్తుడు దేవాలయంలోకి వెళ్లగా హుండీల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకవెళ్లడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఇంతెజార్‌గంజ్ సీఐ మల్లేష్, ఎస్సై కిరణ్మయి, క్లూస్ టీం సభ్యులు చేరుకుని పరిశీలించారు. ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా బ్యాకప్ లేక రికార్డు కాలేదని తేలింది. సుమారు రూ.లక్ష నగదు అపహరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. సీఐ మల్లేష్‌ను వివరణ కోరగా పాత నేరస్తులే చోరీకి పాల్పడి ఉంటారని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పీహెచ్‌సీలో దొంగతనం

- టీవీ, మానిటర్, ఇన్వర్టర్, బ్యాటరీల అపహరణ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోరీ జరిగింది. రూ. 1.50 లక్షల విలువైన మానిటర్, బ్యాటరీలను దొంగలు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. రోజూ మాదిరిగానే శనివారం సాయంత్రం 4 గంటలకు సంబంధిత అధికారులు, సిబ్బంది పీహెచ్‌సీని బంద్ చేసి వెళ్లారు. ఆదివారం ఉదయం కాంటిజెన్సీ వర్కర్ కేదారి వచ్చి పీహెచ్‌సీ తాళం తీసి లోపలికి వెళ్లే సరికి టీవీ కనిపించలేదు. పీహెచ్‌సీలోని గదులను పరిశీలించి ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ అన్వేష్, హెల్త్ సూపర్‌వైజర్ పమ్మి నాగబ్రహ్మచారికి సమాచారం ఇచ్చాడు. వారు పీహెచ్‌సీకి చేరుకుని పరిశీలించి టీవీతోపాటు యూపీఎస్, ఇన్వర్టర్, 3 బ్యాటరీలు, మానిటర్ అపహరణకు గురైనట్లు గుర్తించారు. పీహెచ్‌సీలో గల సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఎవరు చోరీకి పాల్పడ్డారనే అంశం తెలియలేదు. ఆస్పత్రి అధికారులు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



బ్యాటరీలు చోరీకి గురైన దృశ్యం

ఐలోని ఆలయంలో గొలుసు అపహరణ



సీసీ పుటేజీలో అనుమానిత వ్యక్తి

ఐనవోలు: ఐలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం రాత్రి భక్తురాలి బంగారు గొలుసు చోరీకి గురైంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిరాల గ్రామానికి చెందిన గండు వసంత భర్త, ఇద్దరు కూతుర్లతో శనివారం ఆలయానికి వచ్చింది. ఎల్లమ్మ ఆలయంలో బోనం మొక్కు తీర్చుకుంటుండగా గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని 4 తులాల పుస్తెలతాడు లాక్కొని గోడ దూకి పరారయ్యాడు. దీంతో వసంత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న ఆదివారం తెలిపారు.

సెల్ షాపులో..



సెల్ షాపులో పరిశీలిస్తున్న ఎస్సై పవన్

మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల సెల్ షాప్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఉంటే పొన్నం వినయ్ రామాలయం దారిలో వీఆర్ సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి షాపు షెడ్డు రేకులను కత్తిరించిన దొంగలు లోనికి ప్రవేశించి సుమారు రూ.లక్ష విలువ చేసే సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్లారు. పొన్నం వినయ్ ఫిర్యాదు మేరకు ఎస్సై దూలం పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రమేష్ (ఫైల్)

చిట్యాల: విద్యుదాఘాతంతో రైతు మృతి సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిర్మలాపూర్ శివారు రాంచంద్రాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాజె రమేష్(38) తన మిర్చి పంటకు నీళ్లు కట్టేందుకు చెలక వద్దకు వెళ్లాడు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఫ్యూజ్ వైర్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎండి గౌస్ తెలిపారు. మృతిడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం మాధవాపురం గ్రామానికి చెందిన తొడుసు నవీన్(24) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు కురవి ఎస్సై బి.రాము ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీన్ కురవి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాల మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ నవీన్ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలుకింద పడి తాపీమేస్త్రీ ఆత్మహత్య

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలు కిందపడి తాపీమేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్–చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన చెలుకలపల్లి అశోక్(42) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం ధర్మారంలో పనిచేస్తూ బిల్డింగ్ పైనుంచి జారి పడిపోవడంతో చేయి విరిగింది. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో పని చేయలేకపోతున్నాననే బాధ, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మృతుడి భార్య, కొడుకుకు అప్పగించామని సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది యువతి..

చిల్పూరు: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మల్కాపూర్‌కు చెందిన దేవరాజుల నీరజ(22) జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్ వివరాల ప్రకారం.. నీరజ డిగ్రీ చదువుతోంది. ఇటీవల తల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ క్రమంలో కూతురు పెళ్లి చేయాలని తండ్రి పోషయ్య సంబంధం కూడా చూశాడు. అయితే, నీరజ తన తల్లి మృతిని తట్టుకోలేక ఒత్తిడికి గురయ్యేది. ఈ క్రమంలో ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

ఖిలా వరంగల్: పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్నాడు.. తీరా భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ 41వ డివిజన్ కాశికుంట ప్రాంతానికి చెందిన గండేటి స్వామి – శోభ దంపతుల కుమారుడు జగదీశ్వర్(22) అదే ప్రాంతానికి చెందిన యువతిని రెండేళ్ల క్రితం పెద్దలను ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్నాడు. ఏసీలు రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఏడాదిన్నర తర్వాత ఇరువురి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో భర్తను వదిలేసి ఆ యువతి పుట్టింటికి వెళ్లింది. తిరిగి రావాలని ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన జగదీశ్వర్ ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు.

చెల్లితో అసభ్య ప్రవర్తన

- చితకబాదిన గ్రామస్తులు
- పోక్సో కేసు నమోదు

నల్లబెల్లి: చెల్లితో అసభ్యకరంగా ప్రవర్తించిన అన్నను గ్రామస్తులు చితకబాదిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై పోక్సో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన బాలిక(17) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసేందుకు పాన్‌కార్డు నంబర్ కావాలని అధికారులు అడిగారు. దీంతో పెద్దనాన్న కుమారుడు గుడారపు స్వామి(సలేందర్) సాయం కోరింది. తల్లిదండ్రుల అనుమతితో ఇద్దరూ శనివారం మధ్యాహ్నం హనుమకొండకు వెళ్లి దరఖాస్తు చేశారు. తిరుగు ప్రయాణంలో నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లి శివారుకు చేరుకోగానే స్వామి ద్విచక్రవాహనాన్ని దారి మళ్లించి రోడ్డుపక్కన ఉన్న ముళ్లపొదల చాటుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. బాలిక అతడిని నిలదీస్తూ అడ్డుకుని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో అతడు తన ప్రయత్నాన్ని విరమించుకుని శనివారం రాత్రి ఇంటికి తీసుకువచ్చాడు. అదేవిధంగా మూడు రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తుండగా చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక రోదిస్తూ కుటుంబ సభ్యులకు తెలియజేసింది. గ్రామస్తుల సమక్షంలో స్వామిని నిలదీయగా ఎదురుతిరిగాడు. దీంతో గ్రామస్తులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు స్వామిపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

మొక్కజొన్నకు గడ్డి మందు పిచికారీ

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

చెన్నారావుపేట: మొక్కజొన్న పంటకు గడ్డి మందు పిచికారీ చేసిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాపల మధుకు సంబంధించిన మొక్కజొన్న పంటకు ఆయన మామ కూస శ్రీను, అతడి కుమారుడు రాహుల్, బావమరిది సుధాకర్ గెట్టు పంచాయితీని మనసులో పెట్టుకొని శనివారం రాత్రి గడ్డి మందు పిచికారీ చేశారు. దీంతో మొక్కజొన్న పంట ఎండిపోయి నష్టం వాటిల్లింది. గడ్డి మందు పిచికారీ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు ఆదివారం చెన్నారావుపేట పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిపోయిన మొక్కజొన్న పంట

సీపీ కార్యాలయం ఎదుట యువకుడి అలజడి

- రాజ్యాంగం మార్చాలంటూ నినాదాలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోకి ఆదివారం కమలాపూర్‌కు చెందిన దొడ్డ సాయిచరణ్ అక్రమంగా ప్రవేశించడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చాలంటూ నినాదాలు చేశాడు. అప్రమత్తమైన పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్సై ఎండి ఇక్బాల్‌పాషా సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు.

గ్రేటర్ 63వ డివిజన్ కార్పొరేటర్‌పై కేసు

మడికొండ: గ్రేటర్ వరంగల్ 63వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌పై మడికొండ పోలీస్‌స్టేషన్‌లో భూ ఆక్రమణ కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ వేణు కథనం ప్రకారం.. కాజీపేట మండలం సోమిడి శివారులో గల తన 5 గుంటల భూమిని కార్పొరేటర్ జక్కుల రవీందర్ ఆక్రమించాడని అగ్రికల్చర్ ఏడీ నాగేష్ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు కార్పొరేటర్ భూ ఆక్రమణకు పాల్పడినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు.

అత్తపై దాడి చేసిన కోడలు అరెస్ట్

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం ఎడపల్లి గ్రామానికి చెందిన దుర్గం సమత శనివారం తన అత్తపై కొడవలితో విచక్షణారహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సమతను ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.